# భూమిక

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం.

- సమస్తలోకాలకు స్వామి, ప్రభువు అయిన దేవుడే సకల విధాలా ప్రశంసనీయుడు. ఆయన కరుణామయుడు, కృపాసాగరుడు. ఆయనే పరలోక విచారణ దినానికి అధిపతి కూడా.

  (దివ్యఖుర్‌ఆన్ 1:1-3)

- భూమ్యాకాశాలను, చీకటి వెలుగుల్ని సృష్టించిన దేవునికే సకల విధాల ప్రశంసలు శోభిస్తాయి. (6:1)

- స్తుతిస్తోత్రాలకు దేవుడే అర్హుడు. ఆయన ఎవరినీ కొడుకుగా చేసుకోలేదు. విశ్వసార్వభౌమత్వంలో ఆయనకు ఎవరూ భాగస్వాములు లేరు. (ఆయనే యావత్తు విశ్వ సామ్రాజ్యానికి తిరుగులేని చక్రవర్తి). ఒకరి సహాయ సహకారాలపై ఆధారపడేందుకు ఆయన ఎంత మాత్రం అశక్తుడు, అసమర్థుడు కాదు. (17:111)

- సమస్త విధాల ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. ఆయనే తన దాసునిపై ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఈ గ్రంథంలో ఆయన ఎలాంటి వక్ర విషయాలు ఉంచలేదు. ఇందులో అన్ని విషయాలు సవ్యంగా, సమంజసంగా, సహేతుకంగానే ఉన్నాయి. (18:1,2)

- భూమ్యాకాశాలలోని సమస్త వస్తువులకు యజమాని అయిన దేవుడే స్తుతింపదగినవాడు. పరలోకంలో కూడా ఆయనే ప్రశంసనీయుడు ఆయన ఎంతో వివేకవంతుడు, సర్వం తెలిసినవాడు. (34:1)

- భూమ్యాకాశాలను సృష్టించిన దేవుడే సకల విధాలా ప్రశంసనీయుడు. ఆయన దైవదూతలను సందేశహరులుగా నియమించాడు. ఆ దైవదూతలలో కొందరికి రెండేసి రెక్కలు, కొందరికి మూడేసి రెక్కలు, మరి కొందరికి నాల్గేసి రెక్కలు ఉన్నాయి. ఆయన తాను తలచిన విధంగా తన సృష్టితాల రూపకల్పనలో (కొన్ని అవయవాలను) అదనంగా చేర్చుతాడు. నిస్సందేహంగా దేవుడు ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (35:1)

- ప్రపంచంలోనూ, పరలోకంలోనూ సమస్త విధాల ప్రశంసలు ఆయనకే శోభిస్తాయి. (యావత్తు విశ్వవ్యవస్థపై) పాలనాధికారం ఆయనకే ఉంది. మీరంతా (మరణానంతరం) ఆయన దగ్గరికే మరలిపోవలసి ఉంది. (28:70)

- భూమ్యాకాశాలంతటా ఆయనే స్తుతింపదగినవాడు. ప్రొద్దువాలిన తరువాత వేళ, మధ్యాహ్నం వేళ కూడా ఆయన్ని స్మరించండి. (30:18)

- భూమ్యాకాశాల ప్రభువు, సర్వలోకాల స్వామి అయిన దేవుడే సకల విధాల ప్రశంసనీయుడు. భూమ్యాకాశాల్లో ఘనత, ఔన్నత్యాలు ఆయనకే శోభిస్తాయి. ఆయనే అపార శక్తిమంతుడు, అసామాన్య వివేక సంపన్నుడు. (45:36,37)

- విశ్వ సామ్రాజ్యం ఆయనదే. ఆయన సకల విధాలా ప్రశంసనీయుడు. ఆయనకు ప్రతి వస్తువుపై శక్తి, అధికారం ఉన్నాయి. (64:1)

- వారు (తమకు లభించిన స్వర్గవైభవాలు చూసి) "సకల స్తోత్రాలు దేవునికే శోభిస్తాయి. ఆయనే మాకీ మార్గం చూపాడు. ఆయన గనక మాకు సన్మార్గం చూపకపోయి ఉంటే, మా అంతటమేమీ మార్గాన్ని పొందగలిగే వారము కాము" అని అంటారు. (7:43)

- సత్యధర్మం యావత్తు జీవన వ్యవస్థలపై ఆధిక్యత పొందడానికి ఆ దేవుడే తన (అంతిమ) ప్రవక్తకు సత్యాన్ని, హితబోధను ఇచ్చి పంపాడు. (9:33,48:28, 61:9)

- ముహమ్మద్ (స) దేవుని సందేశహరుడు. ఆయన వెంటనున్నవారు అవిశ్వాసులకు ఏ మాత్రం లొంగని దృఢచిత్తులు. అయితే వారు పరస్పరం ఒకరిపట్ల మరొకరు మృదు స్వభావులు, దయామయులు. నీవు వారిని ఎప్పుడైనా చూస్తే, వారు రుకూ, సజ్దాలు (ప్రార్థన) చేయడంలో, దేవుని అనుగ్రహం, ఆయన ప్రసన్నతలను అర్థించడంలో నిమగ్నులయి ఉండటం కనిపిస్తుంది. వారి ముఖాలపై సజ్దా (సాష్టాంగ ప్రణామ) చిహ్నాలు ఉంటాయి. ఆ చిహ్నాలను బట్టి వారు ప్రత్యేకంగా గుర్తించబడతారు. (48:29)

- ఎవరు సత్యాన్ని విశ్వసించి, సదాచార సంపన్నులయి, ముహమ్మద్ (స)పై అవతరించిన దాన్ని కూడా విశ్వసిస్తారో - అది వారి ప్రభువు నుండి వచ్చిన సత్యవాణి - దేవుడు అలాంటి వారి నుండి చెడులేమయినా ఉంటే దూరం చేసి, వారి పరిస్థితిని చక్కబరుస్తాడు. (47:2)

- ముహమ్మద్ (స) మీ పురుషులలో ఎవరికీ తండ్రికాడు. ఆయన దేవుని సందేశహరుడు, అంతిమ దైవప్రవక్త. దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు. (33:40)

- ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా, శుభవార్త అందజేసే వానిగా, భయపెట్టేవానిగా, దేవుని ఆజ్ఞతో ఆయన వైపున సందేశాన్ని అందజేసేవానిగా, ప్రకాశించే దీపంగా చేసి పంపాము. (33:45,46)

- (ఓ ముహమ్మద్!) మేము మిమ్మల్ని సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా పంపాము. (21:107)

- దేవుడు, ఆయన దూతలు దైవ ప్రవక్తకై 'దరూద్'ను పంపిస్తున్నారు. (కనుక) విశ్వాసులారా! మీరు కూడా అతను శాంతీసౌఖ్యాలతో వర్థిల్లాలని (దైవాన్ని) ప్రార్థించండి. (33:56)

ఈ గ్రంథంలో ఇద్దరు ప్రముఖ హదీసువేత్తలు ఏకీభవించిన హదీసుల్ని సంకలనం చేయడం జరిగింది. ఆ ఇద్దరు, సహీహ్ బుఖారీ గ్రంథకర్త ఇమామ్ అబూ అబ్దుల్లా ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బుఖారీ (రహ్మాలై), సహీహ్ ముస్లిం గ్రంథకర్త ఇమామ్ అబుల్ హుసైన్ ముస్లిం బిన్ హిజాజ్ నీషాపూరి (రహ్మాలై). వీరిలో ఇమామ్ బుఖారీ (రహ్మాలై) జీవితకాలం హి.శ. 194 నుండి హి.శ. 256 వరకు కాగా, ఇమాం ముస్లిం (రహ్మాలై) జీవితకాలం హి.శ. 204 నుండి 261 వరకు ఉండింది.

ఈ గ్రంథాన్ని నేను దారుల్ అహ్యావుల్ కుతుబుల్ అరబీ (అరబీ గ్రంథాల పునరుజ్జీవన సంస్థ) సంపాదకులు సయ్యిద్ ముహమ్మద్ హల్బీగారి ప్రేరణతో సంకలనం చేశాను. ఆయనే దీని ప్రచురణ, ముద్రణ బాధ్యతలు కూడా తీసుకున్నారు.

ఈ గ్రంథం కోసం మూలం (Text), పదజాలం రీత్యా సహీహ్ ముస్లిం హదీసులకు అతి దగ్గరగా ఉండే హదీసుల్ని మాత్రమే సహీహ్ బుఖారీ నుండి ఎన్నుకోవాలని సయ్యిద్ హల్బీగారు షరతు విధించారు. ఈ షరతు నా సహనానికి పెద్ద పరీక్షగా పరిణమించింది. ఇప్పటి వరకు ఈ లక్ష్యంతో గ్రంథరచన చేసిన వారెవరూ ఇంతటి కఠినమైన షరతు అనుభవించలేదు. ఫలానా హదీసు ముత్తఫఖున్ అలై (ఏకీభవిత) హదీసులని పేర్కొన్నవారు కూడా ఇలాంటి షరతు పెట్టలేదు.

ఒక హదీసుకు సంబంధించిన రెండు ఉల్లేఖనాలలోని మూలం, పదజాలాల్లో ఒకింత 'వ్యత్యాసం' ఉన్నప్పటికీ, హదీసును ఉల్లేఖించిన మొదటి ఉల్లేఖకుడు రెండు ఉల్లేఖనాల్లోనూ ఒక్కడే అయి ఉంటే చాలు, అది ముత్తఫఖున్ అలై (ఏకీభవిత) హదీసు అనబడుతుందని విశ్వ విఖ్యాత హదీసువేత్త హాఫిజ్ ఇబ్నుహిజ్ర్ (రహ్మాలై) తెలియజేశారు. అంటే ఇప్పుడు ప్రచురణకర్త నాకు విధించిన షరతు ప్రకారం ఈ 'వ్యత్యాసం' మరింత తగ్గిపోయిన హదీసుల్ని మాత్రమే నేనీ గ్రంథం కోసం ఎన్నుకోవలసి ఉందన్న మాట. నేను వీలైనంత వరకు అలాంటి హదీసుల్నే ఈ గ్రంథంలో సంకలనం చేశాను.

దారెఖుత్ని (రహ్మాలై) గారి సమకాలికుడు ముస్లిం బిన్ ఖాసిం ఖర్తబి (రహ్మాలై) తను రచించిన చరిత్ర గ్రంథంలో ఇమామ్ ముస్లిం (రహ్మాలై)ని గురించి ప్రస్తావిస్తూ, 'సహీహ్ ముస్లిం' శీర్షికలు, అధ్యాయాల సక్రమతలో సాటిలేని గ్రంథం అని అన్నారు. అంటే ఏ హదీసునయినా సులభంగా వెతికి తీసుకోవడానికి వీలయిన పద్ధతిలో సహీహ్ ముస్లిం కూర్పు జరిగిందన్నమాట. సహీహ్ బుఖారీ గ్రంథంలో మాత్రం కావలసిన హదీసుని వెతకడం కొంచెం కష్టంతో కూడిన వ్యవహారం. అందువల్ల నేనీ గ్రంథం కోసం సహీహ్ ముస్లింలోని అధ్యాయాల క్రమాన్ని ఎంచుకున్నాను. దాని ప్రకారమే సంకలనం చేశాను.

–ముహమ్మద్ ఫవ్వాద్ అబ్దుల్ బాఖీ